క్లుప్తంగా

సీఎస్ఐ చర్చిలో వేసవి శిక్షణా తరగతులు



వేల్పూర్: పడగల్ సీఎస్ఐ చర్చిలో చిన్న పిల్లలకు గురువారం వేసవి శిక్షణా తరగతులను స్థానిక చర్చి పాస్టర్ రెవరెండ్ ప్రేమ్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో చిన్న పిల్లలు తమ సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోడానికి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. రెవరెండ్ మేషక్, సండే స్కూల్ డైరెక్టర్ తబిత, సెక్రెటరీ రాహుల్, టీచర్లు ప్రభావతి, లావణ్య, వర్ష, వాలంటీర్లు అమూల్య, అఖిల, లలిత, స్రవంతి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001–02 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు మెండోరా మండలం బుస్సాపూర్‌కు చెందిన తమ తోటి విద్యార్థి మృతి చెందడంతో ఆయన కూతురికి రూ.70 వేల ఆర్థిక సహాయం గురువారం అందజేశారు. అలానే పాఠశాలకు రూ.10 వేల విలువ చేసే బెంచీలను అందజేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



బోధన్: సాలూర మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు చెక్కులను అందించామని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, హున్సా సొసైటీ చైర్మన్ మందర్నా రవి, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు అల్లె రమేశ్, ఆవుల పద్మారెడ్డి(సాలంపాడ్ క్యాంప్), జోజయ్య, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లిలో తాటిపత్రులు..



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన నాయకుడు సంతోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం వేంపల్లి గ్రామంలో సన్నకారు రైతులకు తాటి పత్రులను ఫౌండేషన్ చైర్మన్ సంతోష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. భవిష్యత్తులో రైతులకు మరింత అండగా ఉంటానని చైర్మన్ అన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రామనగర్ కాలనీలో సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల వాల్‌పోస్టర్లను గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. శ్రీ కేదారీశ్వర ఆశ్రమ కమిటీ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్, హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఆధ్వర్యంలో ఈ నెల 14, 15, 16వ తేదీలలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రామాలయ శిఖర సుదర్శనంలో ప్రతి ఒక్కరు ఒక రూపాయి భాగస్వామ్యం ఇచ్చి నిర్మాణంలో కర్తవ్యాన్ని నిర్వహించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



మాక్లూర్: నివాసపు పూరి గుడిసె ఎండ తీవ్రతకు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి క్వింటా బియ్యం ఇవ్వగా ఆ బియ్యాన్ని స్థానిక బీజేపీ నాయకులు బాధిత కుటుంబానికి గురువారం అందజేశారు. రెండు రోజుల క్రితం మాదాపూర్ గ్రామానికి చెందిన రమేష్ నివాసపు గుడిసె కాలి బూడిద అయింది. బియ్యాన్ని గ్రామ బూత్ అధ్యక్షుడు ప్రణీత్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు డి రాజేశ్వర్‌లు బాధిత కుటుంబానికి అందజేశారు.

నాణ్యతా లోపం.. ప్రాజెక్టుకు శాపం

- ఉడిపి వాగు ప్రాజెక్టు మరమ్మతు పనులు లోపభూయిష్టం
- ఫలితంగా ప్రాజెక్టు నుంచి నీరు లీకేజీ.. అడుగంటిన జలాలు



నీరు లీకేజీ కావడంలో ఉడిపి వాగు ప్రాజెక్టులో అడుగంటిన జలాలు

మోర్తాడ్ : నాణ్యత లేని పనులతో ఉడిపి వాగు ప్రాజెక్టు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మిషన్ కాకతీయ పథకం కింద రూ.92.70 లక్షలు వెచ్చించి చేసిన పనులన్నీ బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. ఫలితంగా నీటి లీకేజీకి అడ్డు లేకపోవడంతో ప్రాజెక్టులోని నీరు డెడ్ స్టోరేజీకి చేరింది. వేల్పూర్ మండలం రామన్నపేట్ ఉడిపి వాగు నీటిని నిలువ చేసుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చిన్న తరహా ప్రాజెక్టును నిర్మించారు. వెయ్యి ఎకరాలకు ప్రత్యక్షంగా మరో 1,500ల ఎకరాలకు పరోక్షంగా నీరు అందడానికి అవకాశం ఉంది. ప్రాజెక్టును పునరుద్ధరించడానికి 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద నిధులను సమకూర్చింది.

మరమ్మతులు మొదలైనప్పుడే వివాదం..

ఉడిపివాగు ప్రాజెక్టుకు మరమ్మతులు మొదలైన సమయంలోనే వివాదం నెలకొంది. అప్పట్లో అధికార పార్టీ నేతలే కాంట్రాక్టర్లుగా అవతారం ఎత్తడం, పనులు ఎలా ఉన్నా చూసీచూడనట్లు వ్యవహరించి బిల్లులు చెల్లించాలని ఉన్నత శ్రేణి నేతలు ఇంజినీరింగ్ అధికారులపై తీవ్ర వత్తిడి తీసుకొచ్చారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి భరించలేక డీఈ దీర్ఘకాలిక సెలవులో వెళ్లగా జేఈ డిప్యూటేషన్‌పై బదిలీ చేయించుకున్నారు. ఇన్‌చార్జీలుగా మరో ఇద్దరు అధికారులకు బాధ్యతలను అప్పగించి వారితో బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు ఉన్నాయి.

అప్పటి నిర్లక్ష్యం ఇప్పుడు వెంటాడుతున్న వైనం..

2016–17లో కొనసాగిన మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పట్టించుకోకపోవడం ఇప్పుడు ప్రాజెక్టును కష్టాల్లో పడవేశాయి. ప్రాజెక్టు మత్తడి కింద భాగం నుంచి నీరు లీకవుతూ పెద్దవాగులో కలిసి పోయింది. గడచిన వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మత్తడి కింది భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. కాలువలు సరిగా లేకపోవడంతో నీటి పారకం తగ్గిపోయింది.

మరోసారి మరమ్మతులు జరిపితేనే..

ఉడిపి వాగు నీటిని వినియోగించుకోవాలంటే మరోసారి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాజెక్టు మరమ్మతులకు రూ.80లక్షలు అవసరమని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతిపాదనలు పంపినా నిధుల కొరత కారణంగా మరమ్మతులకు మోక్షం లభించలేదు.



వరద తాకిడికి కొట్టుకుపోయిన మత్తడి కింది భాగం

ప్రభుత్వం స్పందించాలి

ఉడిపివాగు ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు మంజూరు చేసే విషయంలో ప్రభుత్వం స్పందించాలి. వర్షపు నీరు ప్రాజెక్టులోకి చేరినా సాగు కోసం వినియోగించుకోలేకపోతున్నాం. గతంలో జరిగిన నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు రైతులు బలికావాల్సి వస్తోంది. ఇప్పుడైనా మరమ్మతులు చేపడితే ప్రయోజనం కలుగుతుంది.

– గంగాధర్, రైతు, రామన్నపేట్

'ఉపాధి' కూలీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



కూలీలతో మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కూలీల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఉపాధి కూలీల కష్టాలను గుర్తించి వారికి చేయూతను అందించాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ భరోసా పథకాన్ని అమలు చేసిందని చెప్పారు. గురువారం సుంకెట్‌లో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. భూమి లేని ఉపాధి కూలీకి ఆరు నెలలకు ఒకసారి రూ.6 వేల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. నాయకులు వేణురాజ్, గోపి, సుధీర్, రాజేష్, భూమారెడ్డి, సాయిరెడ్డి, లడ్డు గంగాధర్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త

బోధన్ రూరల్: సిద్ధాపూర్‌లో గురువారం కృషి విజ్ఞాన కేంద్రం(రుద్రూర్) ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించి నేల ఆరోగ్యం కాపాడడం, రసీదులను భద్రపరచి కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందడం, సాగు నీటిని ఆదా చేయడం, పంట మార్పిడి పాటించి –సుస్థిర ఆదాయాన్ని పొందడం, చెట్లను పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడం వంటి అంశాల గురించి చర్చించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు అలీమ్ అహ్మద్, ఏవో సంతోష్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ శరత్, కేవీకే శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, స్వప్న, రైతులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



ఆర్మూర్‌టౌన్: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ట్రాఫిక్ ఎస్సై రఘుపతి సూచించారు. ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండ్ వద్ద గురువారం పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయన్నారు. మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. సిబ్బంది ఆనంద్, గంగాధర్, పోలీస్ కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు మద్దతు పలికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న యువజన సంఘాల సభ్యులు

వేల్పూర్: ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైనికులు జరిపిన దాడిలో పాకిస్తాన్‌కు చెందిన కొందరు మృతి చెందడంతో దానిని వ్యతిరేకిస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వేల్పూర్ గ్రామానికి చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గురువారం రాత్రి యువజన సంఘాల సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ర్యాలీ నిర్వహించారు.

వలస వచ్చిన నేతలకు కాంగ్రెస్‌లో ప్రాధాన్యత



మోస్రాలో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ని: ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్‌లో ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులను వదిలేసి నిన్న మొన్న ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో ప్రాధాన్యత కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మోస్రా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. గురువారం మోస్రా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంతియాజ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. అసలైన కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేస్తున్నారని ఇంతియాజ్ ఆరోపించారు. వలస నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకుపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా పార్టీ అధినాయకత్వం ఈ విషయంలో శ్రద్ధ తీసుకొని పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రోత్సహించాలని కోరారు.

రికార్డుల పరిశీలన

నవీపేట: నవీపేట మేజర్ జీపీ కార్యాలయాన్ని డీఎల్‌పీవో శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని కార్యదర్శి రవీందర్ నాయక్‌కు సూచించారు. మేకల, వారాంతపు కూరగాయల సంతలలోని సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు.

బుద్ధ పూర్ణిమ మహోత్సవం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

ఆర్మూర్‌టౌన్: అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 12న మెట్‌పల్లిలో నిర్వహించనున్న బుద్ధ పూర్ణిమ మహోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని ఆర్మూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇత్వార్‌పేట్ లింగన్న మాట్లాడుతూ.. ప్రపంచ శాంతి గౌతమ బుద్ధుడి బోధనలతో సాధ్యమని పేర్కొన్నారు. దళిత, బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ జానపద గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెల, ప్రక్రుతి కవి జైరాజ్, తదితరులు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. నాయకులు కొంతం మురళీధర్, పింజ సుదర్శన్, కొంత పూర్ణచందర్, ద్యావతి రవి, రాజు, గైని సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా భారీ ర్యాలీ



బోధన్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



భీమ్‌గల్‌లో బీజేపీ నాయకుల సంబురాలు



జవాన్‌కు నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

బోధన్‌టౌన్(బోధన్): పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్న భారత సైనికులకు అండగా యావత్ దేశ ప్రజలు ఉన్నారని డీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. భారత సైనికులకు మద్దతుగా గురువారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ హెడ్ పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. భారత మాతాకీ జై, జై జవాన్ అంటూ నినాదాలు చేశారు. పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, శివాలయం చైర్మన్ హరికాంత్ చారీ, మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షులు ఖలీం, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు తలారి నవీన్‌కుమార్, నాయకులు తూము శరత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలు

మోర్తాడ్: ఉగ్రవాదులను హతం చేయడానికి చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో భీమ్‌గల్ పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం సంబురాలు నిర్వహించారు. నాయకులు యోగేశ్వర్ నర్సయ్య, బండారి లక్ష్మణ్ గౌడ్, సంధ్యారాజు, ప్రతాని ప్రవీణ్, అంజి, హరిప్రసాద్, నవీన్, అజయ్, గణ ఈశ్వర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్నూర్ మండలంలోని దెగ్లూర్‌కు చెందిన జవాన్ సచిన్ యాదవ్ వనందే జమ్మూ కశ్మీర్‌లో జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందిన సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల మౌనం పాటించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందుకు భారత సైనికులకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్, ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన



మోర్తాడ్: భీమ్‌గల్ మండలం మెండోరాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం కనుల పండువగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయిబాబా విగ్రహంతో పాటు గణపతి, శివలింగం, దత్తాత్రేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



రుద్రూర్: పోతంగల్ మండలంలోని రెండు చెక్‌పోస్టులను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోతంగల్ శివారులోని మంజీరా సమీపంలో ఇసుక ట్రాక్టర్లను ఆపి వేబిల్లులు పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచాలని చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. మహారాష్ట్ర నుంచి ధాన్యం రాకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్ కార్యాలయాన్ని సందర్శించి కొత్త రేషన్ కార్డుల ఎంక్వైరీ వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ గంగాధర్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



వర్ని: మరాఠా యోధుడు, ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గురువారం తగిలేపల్లిలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివాజీ పోరాట స్ఫూర్తిని కొనియాడారు. మల్లారం ఆశ్రమ మహారాజ్ పిట్ల కృష్ణ మహారాజ్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు జరిగే అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా

వేల్పూర్: భారత్– పాకిస్తాన్ సరిహద్దులో ఏర్పడిన ఉద్రిక్తత, యుద్ధ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం బాల్కొండ నియోజకవర్గంలో జరగాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలు వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాకిస్తాన్‌పై దాడి చేసి ఉగ్రవాదులను మట్టుబెట్టడం.. ఒక భారతీయుడిగా ఈ చర్యను సమర్థిస్తూ గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరం ఏకమై సైన్యానికి మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం..

బాల్కొండ: బాల్కొండ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని బాల్కొండ ఏఈఈ కిషన్ గురువారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉండటం వల్ల బాల్కొండ, కిసాన్‌నగర్ గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థులకు సమ్మర్ క్యాంప్

బోధన్/నందిపేట/పెర్కిట్/వేల్పూర్/డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(జెడ్పీహెచ్ఎస్)లో, వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, నందిపేట జెడ్పీహెచ్ఎస్‌లో, సాలూర జెడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 10 నుంచి 25 వరకు విద్యార్థులకు ఉచిత సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల ఎంఈవోలు రామకృష్ణ, రేణుక, నరేందర్, అవదూత గంగాధర్, రాజీ మంజూషలు వేర్వేరుగా తెలిపారు. 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఆర్ట్ క్రాఫ్ట్, డ్రాయింగ్, పెయింటింగ్, తదితర విషయాల్లో శిక్షణ ఇస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువులో ఇష్టారీతిన తవ్వకాలు

- అభివృద్ధి పేరుతో మొరం తరలింపు
- క్వారీ నిర్వాహకుల దారి మళ్లిస్తున్నారని గ్రామస్తుల ఆరోపణ



పెద్ద చెరువులో మొరం తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చుతున్న పొక్లెయిన్

బోధన్: రెవెన్యూ డివిజన్‌లో పలు చోట్ల మొరం తవ్వకాలు, రవాణా వివాదాస్పదంగా మారుతున్నాయి. అభివృద్ధి పేరుతో అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా మొరం దారి మళ్లిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. చెరువుల్లో మొరం తవ్వకాలకు అనుమతులిచ్చి అధికారులు తవ్వకాలు, రవాణాపై పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంట్రాక్టర్ల లాభాపేక్ష వల్ల చెరువుల్లో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. సాలూర మండలంలోని హున్సా శివారులో ప్రభుత్వం మంజూరు చేసిన మొరం రోడ్డు నిర్మాణం కోసం డివిజన్ ఇరిగేషన్ శాఖ అధికారులు జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని పెద్ద చెరువులో ఈ నెల 7, 8, 9, 12 తేదీల్లో మొరం తవ్వకాలు, తరలింపునకు అనుమతి ఇచ్చారు. ఇందుకు 8 టిప్పర్లకు రవాణాకు అనుమతి ఇస్తున్నట్లు అనుమతి పత్రంలో పేర్కొన్నారు. కాగా చెరువులో పొక్లెయినర్‌తో మొరం తవ్వకాలు చేపట్టారు. దీంతో భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం మూడు నాలుగు ఫీట్లలోతు వరకు తవ్వకాలు చేపట్టాలని అధికారులంటున్నారు. కాని ఇక్కడ 7 ఫీట్ల కంటే ఎక్కువ లోతులోనే తవ్వకాలు జరిగాయి. గ్రామస్తులు కొందరు అధికారులకు ఫోన్ల ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అభివృద్ధి పనుల పేరుతో చెరువును ధ్వంసం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. భారీ గుంతల వల్ల చెరువు నీరు తూమునుంచి బయటకు వెళ్లే పరిస్థితి ఉండదని వారంటున్నారు. మొరం తవ్వకాలతో ఏర్పడిన గుంతలను గురువారం సాయంత్రం ప్రొక్లెయిన్‌తో పూడ్చివేత పనులు చేపట్టారు.

నాలుగు రోజుల పాటు అనుమతిచ్చాం

మొరం తవ్వకాలు, తరలింపునకు నాలుగు రోజుల పాటు అనుమతిఇచ్చాం. క్వారీ నిర్వాహకులు మొరం దారి మళ్లిస్తున్నారని గ్రామస్తుల నుంచి ఫోన్‌లో సమాచారం, ఫిర్యాదులు వచ్చాయి. మొరం దారి మళ్లిస్తే కేసులు నమోదు చేస్తాం. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదు.

– బలరాం, ఇరిగేషన్ డివిజన్ ఈఈ, బోధన్

భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలి



బాల్కొండ: రైతులు భూసార పరీక్షలను తప్పకుండా చేయించాలని వ్యవసాయ శాస్త్రవేత్త కల్పన అన్నారు. గురువారం ముప్కాల్ మండలం కొత్తపల్లిలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తక్కువ యూరియాను వినియోగించాలన్నారు. అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలన్నారు. సాగు నీటిని ఆదా చేసుకోవాలన్నారు. వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి రవి, అడ్వైజరీ కమిటీ సభ్యుడు నరసింహ నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పరీక్షల ఆధారంగా ఎరువులు వేయాలి



రుద్రూర్: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం చేపట్టాలని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రమ్య రాథోడ్ అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వరి పంటలో తడి–పొడి విధానం ద్వారా 15–30 శాతం వరకు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మొక్కజొన్నలో బిందు సేద్యం లేదా వరుస విడిచి వరుస నీటిపారుదల వల్ల నీటి ఆదా చేయవచ్చని వివరించారు. ఫుడ్ సైన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్.జయప్రకాష్ తెలిపారు. ఏవో టి.రాజు, ఏఎంసీ చైర్మన్ హనుమంతు, వైస్ చైర్మన్ అనిల్ కుమార్, మాజీ ఎంపీటీసీ మనోహర్, ఏఈవోలు అస్మా బేగం, సతీష్ కుమార్, ఎస్కే గౌస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం ఇన్‌చార్జి తహసీల్దార్ పరిశీలించారు. పక్క రాష్ట్రం మహారాష్ట్ర నుంచి జిల్లాలోకి వరి ధాన్యం రాకుండా కందకుర్తి వద్ద ఉమ్మడి చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు.